# ది పేపర్ వెయిట్



మీటింగ్ ప్రారంభమై అరగంట కావస్తోంది. అప్పుడు సమయం రాత్రి ఎనిమిదిన్నర. పోలీసు ఉన్నతాధికారుల అతి ముఖ్యమైన సమావేశమది. దేశరక్షణకు సంబంధించిన ఒక ముఖ్య విషయంపై చర్చ జరుగుతోంది.

ఆ విషయానికి సంబంధించిన కాగితాలు పోలీస్ కమీషనర్ షేర్‌ఖాన్ ముందున్నాయి. ఆ కాగితాలకి ఇంకాస్త ముందుగా ఆయన ఎదురుగా ఉందొక పేపర్-వెయిట్. ఏనుగు దంతంతో తయారు చేయబడిన ఆ పేపర్-వెయిట్ చాలా ఆకర్షణీయంగా ఉంది. కొన్ని రోజుల క్రితం ఏదో సందర్భాన ఒక పోలీస్ అధికారి ఆయనకు ప్రెజంట్ చేశాడు ఆ పేపర్‌వెయిట్. దానిని ఉపయోగించే అవసరం ఎప్పుడూ రాలేదాయనకి.

కొంత సేపటికి కరెంట్ పోయింది. రెండు నిముషాలలో జెనరేటర్ ఆన్ చేయబడింది. తొమ్మిది గంటలకు ముగిసింది మీటింగ్.

అందరూ వెళ్ళిపోయాక టేబుల్ దగ్గర కొచ్చి తన సీటులో కూర్చున్నారు షేర్‌ఖాన్. టేబుల్ చూసి ఆశ్చర్యపోయారు. అక్కడ కాగితాలమీద పెట్టబడిఉందిఆ పేపర్-వెయిట్. తాను ఆ పేపర్-వెయిట్‌ని పెట్టలేదే! దాని నసలు ముట్టుకొననే లేదు. కాగితాల వైపు చూసి ఉలిక్కి పడ్డారాయన, ఇందాక జరిగిన చర్చకు సంబంధించిన ఆ రహస్య పత్రాలు పేపర్‌వెయిట్ కింద లేవు! మీటింగ్‌లో కరెంట్ పోయినప్పుడు వాటి నెవరో తస్కరించి ఉంటారు.

కాగితాల మీద పేపర్-వెయిట్ లేక పోయినా తొందరలో నేరస్థుడు దానిని పెట్టి ఉంటాడు అజాగ్రత్త వల్ల. గబగబా మిగిలిన కాగితాల నందుకోబోయి ఠక్కున ఆగి పోయారాయన!

* * *

తన కుమార్తె జీనత్ బర్త్‌డేని ఘనంగా జరిపించాలని నిశ్చయించారు షేర్‌ఖాన్

రహస్య పత్రాలను దొంగిలించిన నేరస్థుడిని పట్టుకోవడంఆ పార్టీలోని భాగం! నేరస్థుడు మీటింగ్‌లో పాల్గొన్న అధికారులలో ఒకడని తెలుసాయనకి. నేరస్థుడిని పార్టీలోనే పట్టుకోవడానికి గట్టిప్లాన్ వేశారాయన.

విదేశాలనుంచి రకరకాల పానీయాలు తెప్పించబడ్డాయి. నార్త్ ఇండియా నుంచి ప్రత్యేకంగా కుక్స్ రప్పించబడ్డారు. నగరంలోని ప్రముఖులందరూ ఆహ్వానించ బడ్డారు. పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యంగా ఆ రోజు మీటింగ్‌లో పాల్గొన్నవారు. వ్యాపారస్థులు మొదలయిన వారందరూ వచ్చారు పార్టీకి.

సాయంత్రం ఏడుగంటలకు ప్రారంభమైంది పార్టీ.

అతిధులందరూ వచ్చారు. జీనత్ కేక్ కట్ చేశాక బర్త్‌డే సాంగ్ పాడారందరూ. అతిధులందరికీ డ్రింక్స్ సర్వ్ చేయబడ్డాయి. తెల్లటి యూనిఫారంలో చేతులకు తెల్లటి గ్లౌజ్‌లతో డ్రింక్స్ సర్వ్ చేస్తున్నారు కొందరు. గ్లాసుల అడుగు భాగాలలో ఆయా అతిధుల పేర్లను చిన్న చిన్న అక్షరాలలో డిజైన్‌లా చెక్కించాడు షేర్‌ఖాన్. ఆ పేపర్లను బట్టి ఏ అతిథికివ్వవలసిన గ్లాసును ఆ అతిథికిస్తున్నారు సర్వర్లు. గ్లాసుల కింద అలా పేర్లున్నట్టు ఇంకెవ్వరికీ తెలీదు.

గోడల పక్కగా నిలబడి అతిథులను జాగ్రత్తగా గమనిస్తున్నారు కొందరు సర్వర్లు. మిగతాసర్వర్లయూనిఫారంలోనేఉన్నా. నిజానికి వారు సర్వర్లు కారు. వారికి సర్వ్ చేసే అవకాశం దొరకటం లేదు. ఇది కూడా ప్లాన్‌లోని భాగమే. ఏ అతిధి కివ్వవలసిన గ్లాసు ఆ అతిథికి ఇవ్వబడుతుందో లేదో వారు గమనిస్తున్నారు. గ్లాసులు కలిసిపోకుండా చూసేందుకు వారు షేర్‌ఖాన్ చేత ప్రత్యేకంగా నియమింపబడ్డినవారు.

పార్టీ చాలా ఉల్లాసంగా జరుగుతోంది. రంగు రంగుల బల్బులతో, గాజు గ్లాసుల శబ్దాలతో ఆహ్లాదంగా ఉంది వాతావరణం. ఒక పక్కగా స్టేజీ మీద ఆంగ్లో ఇండియన్ బృందం ఆర్కెస్ట్రా సంగీతం! ఒక్కొక్కరినే కలుసుకుంటూ వారితో కరచాలనం చేస్తూ ఏదో మాట్లాడుతున్నాడు షేర్‌ఖాన్. అతిథులు గుంపులు గుంపులుగా నిలబడి వారిలో వారు ఏవో చర్చించుకుంటూ, జోకులేసుకుంటూ నవ్వుకుంటున్నారు. మరో పక్క తనకిస్తున్న ప్రెజంటేషన్స్‌ని నవ్వుతూ అందుకుంటోంది జీనత్.

ఖాళీ అయిన గ్లాసుల్ని ట్రేలో పెట్టుకొని తీసుకెళ్ళి పోతున్నారు సర్వర్లు. గ్లాసులు ఒకదాని కొకటి తగలకుండా జాగ్రత్త పడుతూ మేడమీదికి తీసుకెళ్ళి అక్కడ పెట్టేస్తున్నారు.

పార్టీ అయిపోవచ్చింది. చివరగా జీనత్ డాన్స్‌ప్రోగ్రామ్! అందరూ చాలా ఆసక్తిగా చూస్తున్నారు. అద్భుతంగా, మ్యూజిక్‌కి అనుగుణంగా స్టెప్స్ వేస్తూ అందరినీ చకితుల్ని చేస్తోందామె.

డాన్స్ అయిపోవచ్చింది. గబగబా మెట్లెక్కి మేడమీద కెళ్ళారు షేర్‌ఖాన్. ఐదు నిముషాల తరువాత ఇద్దరు కానిస్టేబుల్స్‌తో కిందకొచ్చారు. ఇంతలో డాన్స్ పూర్తయింది. అతిథుల కరతాళ ధ్వనుల లోంచి రెండవ వరుసలో కూర్చుని ఉన్న ఇన్‌స్పెక్టర్ జనరల్ షా దగ్గర కెళ్ళిచెప్పారు.

"ఆయాం సారీ, షా! యు ఆర్ టు బి అరెస్టెడ్!"

ఆశ్చర్యంగా లేచి నిలబడ్డాడు అతడు! మరుక్షణం ఆ ప్రదేశమంతా చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దమైపోయింది. తన వెనుక ఉన్న కానిస్టేబుల్స్ వైపు చూసి సౌజ్ఞ చేశారు షేర్‌ఖాన్!

భూమిని బద్దలు చేస్తున్నట్లు నడుస్తూ ముందుకొచ్చి ఆ వ్యక్తికి బేడీలు వేశారు

మహమ్మద్ ఇర్షాద్ అహమ్మద్

కానిస్టేబుల్స్.

* * *

పోలీస్ స్టేషన్‌లోని ఇంటరాగేషన్ రూమ్‌లో అరగంటనుంచీ కట్టివేయబడి ఉన్నాడు షా. నేరాన్ని ఒప్పుకోవడం లేదు.

"షటప్!" గర్జించారు షేర్‌ఖాన్!

"నో సర్! నిజంగా నాకేమీ తెలీదు"

"డామిట్! తెలీదు, తెలీదు, తెలీదు! ప్రతి నేరస్థుడికి ఇదొక ఊతపదం!"

"నువ్వొ ఇన్‌స్పెక్టర్ జనరల్‌వి? సిగ్గు లేదూ."

పోలీసు డిపార్టుమెంటుకే మచ్చతెచ్చావు. చెప్పు! ఏం చేశావా రహస్య పత్రాల్ని? ఏ దేశాని కమ్మేశావు?

కమాన్! నిజం చెప్పు! లేకపోతే ఏం జరుగుతుందో పోలీస్ అధికారిగా నీకు తెలుసు" గట్టిగా అరుస్తూ ఆయాస పడుతున్నారు షేర్‌ఖాన్.

"నాకేమీ తెలీ...."

"షటప్!" షా చెంప ఛెళ్ళుమంది.

"నీ లాంటి వాడు దేశాన్ని పావలా కమ్మేస్తాడు. ఒకనాడు నువ్వు నాకు ప్రెజెంట్ చేసిన ఆ దంతపు పేపర్-వెయిట్ చెబుతోంది నువ్వు నేరస్థుడివని...." అంటున్న షేర్‌ఖాన్ చేతికి షా చెంపమీద కొట్టినప్పుడు అదొక రకంగా అనిపించింది. చేతి వైపు చూసుకున్నారాయన. ఆయన కేదో అనుమానం వచ్చింది.

"ఎవరున్నువ్వు!"" హఠాత్తుగా ప్రశ్నించారు బిత్తరపోయాడు షా.

"పిచ్చివేషాలెయ్యకు!" అంటూ చేతిని షా గెడ్డం కిందగా పోనిచ్చి లాగారు. ఆశ్చర్యం అచ్చం షా ముఖంలాగే ఉన్న ఫేస్ మాస్క్ ఊడి వచ్చింది. ఆ వ్యక్తి షా కాదు!!!

* * *


ఐజిఆఫ్ పోలీస్ "షా" లాగే నటించి మోసం చేసిన ఆ వ్యక్తి శరీరంలోంచి కరెంట్ ప్రవహిస్తోంది. ఆ వ్యక్తి నిలువెల్లా వణికిపోతున్నాడు. దవడలు ఎగిరెగిరి పడుతున్నాయి; త్వరలోనే చెమటతో తడిసి ముద్దయ్యాడు.

"నో స్టాపిట్! ప్లీజ్ స్టాపిట్!" అంటూ అరుస్తున్నాడు. మరో రెండు నిముషాల తర్వాత కరెంట్ ఆపి వేశారు. తలవాల్చేశాడా వ్యక్తి. స్పృహతప్పింది. ముఖంమీద నీళ్ళు చల్లి స్పృహ తెప్పించారు. మళ్ళీ కరెంట్ పెట్టబున్నారు షేర్‌ఖాన్.

"నో. వద్దు! ఆ కాగితాలు నా దగ్గరే ఉన్నాయి!" చెప్పాడా వ్యక్తి!

"మాకు పూర్తి వివరాలు కావాలి మిస్టర్"

ఖంగుమంది షేర్‌ఖాన్ కంఠం. "ముందు నువ్వెవరివో చెప్పు! షాని ఎక్కడ దాచావు?



ఆ పత్రాలతో నీకేం పని?"

"చెప్తాను.

నా పేరు టిమోతీ.

మొదట భారతీయుడినే.


చైనీస్ యువతిని వివాహం చేసుకొని అక్కడే ఉండిపోయాను.

నా అసలు పేరు రాజారావు. చైనా వెళ్ళాక పేరు మార్చుకున్నాను.

చైనా ప్రభుత్వం నాకు గూఢచారిగా ఉద్యోగమిచ్చింది. మీరు వేస్తున్న ప్లాన్ గురించి మా వాళ్ళకు కొద్దిగా తెలిసింది. పూర్తి వివరాలకోసం ఆ పత్రాలను తెమ్మని నన్ను ఆదేశించారు." ఆగాడతడు.

"షా యెక్కడ?" ఆశ్చర్యపోతూ ప్రశ్నించారు షేర్ ఖాన్. వారి మాటల్ని మొదట్నించీ రికార్డు చేస్తున్నారాయన.

"మాసిలమనీ రోడ్‌లో 77వ నంబరు ఇంటిలో బంధించబడి ఉన్నాడు. మీ పత్రాలున్న బ్రీఫ్ కేస్ అక్కడే ఉంది."




* * *

శ్రీ టిమోతీ చెప్పిన అడ్రసును బట్టి ఆ రహస్య పత్రాలు పోలీసుల స్వాధీనం అయ్యాయి. చైనీస్ గూఢచారిని పట్టుకున్నందుకు షేర్ ఖాన్ పేరు దేశమంతటా మారుమ్రోగిపోయింది.

ఆ రోజు సాయంత్రం పత్రికా విలేఖరుల సమావేశంలో షేర్ ఖాన్ మాట్లాడుతూ, నిజానికిందులో నేనే చేసిందేమీ లేదు. నా పేపర్ వెయిటే అంతా చేసింది. నేరస్థుడి అజాగ్రత్త వల్ల అతని వేలి ముద్రలు పేపర్-వెయిట్ మీద పడ్డాయి. అలాగే పార్టీలో అతిథుల గ్లాసుల మీది వేలిముద్రలను నిపుణుల చేత పరిశీలింప జేసాను. ఒక గ్లాసు మీది వేలిముద్రలు మాత్రం పేపర్-వెయిట్ మీది వేలిముద్రలతో సరిపోయాయి.

ఆ గ్లాసు అడుగుభాగానే దానిలో తాగిన వ్యక్తి పేరుంది గాబట్టి నేను వెంటనే నేరస్థుడిని పట్టుకో గలిగాను" అన్నారు.

"తరచూ నేరస్థుడి అజాగ్రత్త మీకుమంచి క్లూలు ఇస్తుంటుంది. ఆర్ వి రైట్?" అన్నాడొక విలేకరి నవ్వుతూ.

---

ఎన్ని రాత్రులు
ఏ స్వార్థం లేకుండా
ఈ సమాజం కోసం
నీ నిద్రను దానం చేశావో!
ఎన్నిసార్లు ఎడతెగని ఆలోచనలకు
నీ బుర్రను బద్దలు కొట్టుకున్నావో!
తొలిచూలు అమ్మలాగా
ఎంత ప్రసవ వేదన పడ్డావో!
ఎప్పుడు ఏ అర్ధరాత్రో!
ఆకస్మాత్తుగా మెదడు సూర్యుడైతే
"యురేకా" అంటూ ఎంత ఆనందించావో!
అప్పుడు
ఆ సుముహూర్తంలో
నీ గుండె రాల్చిన రక్తాక్షరాలనుచూసి
అధికారం కళ్ళలో తుపాకులు మెరిశాయి!
నీవు చచ్చావని సంబరపడి
అందంగా వెనక్కి చూసుకొని
ఎరుపెక్కిన కళ్ళతో
పిడికిళ్ళు బిగిస్తున్న నీ అక్షరాలనుచూసి-
అసలు నీవు చచ్చాక సజీవంగా నవనవంగా జీవిస్తానని
అనుభవంతో తెలిసికొని
కాళ్ళల్లో వణుకుపుట్టి-
కళ్ళల్లో జీవం చచ్చి-
భయం భయంగా
నీ అక్షరాల అగ్ని శిరస్సులపై
ముళ్ళ కిరీటాలుంచబోయింది!
పాపం! ఆ సెగలకు మూర్చబోయింది!
ఇక దాని శ్వాస నేల తల్లి కాళ్ళ దగ్గరే!




కోట్ల వెంకటేశ్వరరెడ్డి